# కేసీఆర్ కల.. నెరవేరిన వేళ..

*తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ పాలనలో భద్రాద్రి జిల్లాలో చేపట్టిన సీతారామ ప్రాజెక్టు జలాలు రైతుల చెంతకు చేరాయి. దీంతో కేసీఆర్ దశాబ్దాల కల ఈ ప్రాజెక్టు నిర్మాణంతో నెరవేరినట్లయింది. గోదావరి జలాలను కృష్ణా జలాలకు అనుసంధానం చేయాలని, ఉమ్మడి ఖమ్మం జిల్లాను సస్యశ్యామలం చేయాలని నాటి ముఖ్యమంత్రి కేసీఆర్ చేసిన భగీరథ యత్నం ఫలించింది. దీంతో నేడు లక్షలాది మంది రైతుల కళ్లల్లో ఆనందం వ్యక్తమవుతోంది. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో 6.75 లక్షల ఎకరాలకు సాగు నీరందించే లక్ష్యంతో రూ.13 వేల కోట్ల అంచనా వ్యయంతో నాటి ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రత్యేక పర్యవేక్షణ, చొరవతో సీతారామ ప్రాజెక్టు పనులు శరవేగంగా కొనసాగాయి. అయితే, ఈ నిర్మాణ పనులకు సంబంధించి అంచనా వ్యయాన్ని మాత్రం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం రూ.19 వేల కోట్లకు పెంచింది. బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలోనే 70 శాతానికి పైగా పనులు పూర్తయ్యాయి. ఆయా ప్రాంతాల్లో కాలువల నిర్మాణ పనులకు తుది మెరుగులు దిద్దిన కాంగ్రెస్.. ఈ ప్రాజెక్టును వారి హయాంలోనే పూర్తి చేసినట్లు ప్రగల్భాలు పలుకుతోంది. దీంతో రైతులు ముక్కున వేలేసుకుంటున్నారు. సీతారామ ప్రాజెక్టు ద్వారా తమ సాగు భూముల్లో పారే ప్రతి చుక్క కేసీఆర్ పుణ్యమేనంటూ కృతజ్ఞతాభావాన్ని వ్యక్తం చేస్తున్నారు. -ఖమ్మం, మార్చి 5 (నమస్తే తెలంగాణ ప్రతినిధి)*

- తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కృషి వల్లే 'సీతారామ' పూర్తి
- ఉమ్మడి ఖమ్మం జిల్లాను సస్యశ్యామలం చేయాలన్న సంకల్పం ఫలప్రదం
- 'ఏన్కూరు లిఫ్ట్ కెనాల్' ద్వారా సాగునీరు విడుదల చేసిన మంత్రి తుమ్మల



సీతారామ ప్రాజెక్టు నుంచి ఒక చుక్క నీరు కూడా రాదంటూ నాడు ఊరూరా ప్రచారం చేసిన కాంగ్రెస్ నాయకులు.. నేడు అదే సీతారామ ప్రాజెక్టు ద్వారా సాగునీరు అందించి రైతుల పాదాలను కడుతున్నామని చెబుతుండడంతో రైతులు అవాక్కవుతున్నారు. సీతారామ ప్రాజెక్టు నిర్మాణానికి ఆనాడు ప్రతిపక్ష హోదాలో ఉన్న కాంగ్రెస్ పార్టీ ఏమాత్రమూ సహకరించలేదు. పైగా ఇప్పుడు రాజకీయ ప్రయోజనం కోసం తన ఘనత అంటూ ప్రచారం చేసుకుంటోంది. ఈ క్రమంలో బుధవారం ఖమ్మం జిల్లా ఏన్కూరు మండలం వినోభానగర్ వద్ద ఏర్పాటు చేసిన ఏన్కూరు లింక్ కెనాల్‌కు సాగునీరుని విడుదల చేసింది. దీనిద్వారా వైరా రిజర్వాయర్‌కు గోదావరి జలాలను పంపించి.. తల్లాడ కల్లూరు, పెనుబల్లి, సత్తుపల్లి మండలాలతోపాటు ఆంధ్రా ప్రాంతంలోని 32 వేల ఎకరాలకు సాగునీరు అందించే అవకాశం కలుగుతున్నది. అయితే, భద్రాద్రి ములకలపల్లి మండలం కమలాపురం నుంచి ఏన్కూరు వినోభానగర్ వద్ద నిర్మించిన కెనాల్‌కు సాగునీటిని విడుదల చేసినా నీటి ప్రవాహం తక్కువగా ఉండడంతో రాత్రి 11 గంటల వరకు సదరు కెనాల్‌కు జలాలు చేరలేదు. అయితే, మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాత్రం జూలూరుపాడులో ఇందుకు సంబంధించిన సభను నిర్వహించి సాగు జలాల విడుదలను చేపట్టారు. ఈ సందర్భంగా జరిగిన సభలో ఆయన ప్రసంగిస్తూ.. సీతారామ ప్రాజెక్టు నిర్మాణం త్వరితగతిన పూర్తి కావడానికి కాంగ్రెస్ పార్టీ కృషి చేసిందని చెప్పారు. కొన్ని ప్రాంతాల్లో ఇప్పటికీ నిర్మాణ పనులు కొనసాగుతూనే ఉన్నాయని అన్నారు. అయితే, వినోభానగర్ వద్ద నిర్మించిన రాజీవ్ సీతారామ ప్రాజెక్టుకు సంబంధించి తెలంగాణ ప్రభుత్వంలో ఇరిగేషన్ శాఖ మంత్రిగా ఉన్న హరీశ్‌రావు, నాటి జిల్లా మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ అనేకసార్లు ప్రత్యక్షంగా పర్యవేక్షించి పనుల వేగవంతంలో కీలకభూమిక పోషించారు. సీతారామ ప్రాజెక్టు పనులు పూర్తయ్యాయని కాంగ్రెస్ పాలకులు చెప్పారు. నీటి విడుదల కార్యక్రమాన్ని గతేడాది ఆగస్టు 15న ములకలపల్లి మండలంలో స్వయంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రారంభించి సాగు నీటి జలాలను విడుదల చేశారు. సాగునీటి జలాలను అశ్వాపురం, ములకలపల్లి మండలాల్లో రేవంత్‌రెడ్డి, మల్లు భట్టివిక్రమార్క విడుదల చేశారు. సంవత్సరాలుగా నిర్మాణంలో ఉన్న ప్రాజెక్టులను పరిగణనలోకి తీసుకోకుండా నాటి ముఖ్యమంత్రి కేసీఆర్ భగీరథ యత్నాన్ని కప్పిపుచ్చే ప్రయత్నంగా సీతారామ సాగు జలాల విడుదలలోనూ తమదైన శైలిలో రాజకీయ ప్రయోజనాన్ని ఆశించి వ్యవహరించడాన్ని ఖమ్మం జిల్లా రైతులు తప్పుబడుతున్నారు. సీతారామ ప్రాజెక్టు ద్వారా సాగు జలాలు విడుదల కావడం గత బీఆర్‌ఎస్ ప్రభుత్వ కృషేనని మాజీ మంత్రి హరీశ్‌రావు వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి తిట్టడం తప్ప కట్టడం చేతకాదని విమర్శించారు. సీతారామ నిర్మాణంలో ఎవరు కృషి చేశారో ప్రజలకు తెలుసని పేర్కొన్నారు.

### 'సీతారామ' నీటితో ఉమ్మడి జిల్లా సస్యశ్యామలం: తుమ్మల

జూలూరుపాడు, మార్చి 5: సీతారామ ప్రాజెక్టు కెనాల్ ద్వారా వస్తున్న నీటితో ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని సాగుభూములు సస్యశ్యామలమవుతాయని, తాగునీటి ఎద్దడి తీరుతుందని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పేర్కొన్నారు. భద్రాద్రి జిల్లా జూలూరుపాడు మండలం వినోభానగర్ సమీపంలో సీతారామ ప్రాజెక్టు మెయిన్ కెనాల్ నుంచి ఏన్కూరులోని సాగర్ కాలువ ద్వారా వైరా రిజర్వాయర్‌కు బుధవారం రాత్రి సాగునీటిని వైరా ఎమ్మెల్యే రాందాస్‌నాయక్‌తో కలిసి విడుదల చేశారు. ఈ సందర్భంగా సీతారామ ప్రాజెక్టు క్వార్టర్ల వద్ద ఏర్పాటుచేసిన కార్యక్రమంలో తుమ్మల మాట్లాడుతూ.. సీతారామ జలాలతో రైతులకు సాగునీటి కష్టాలు తీరాయని పేర్కొన్నారు. భద్రాద్రి, ఖమ్మం కలెక్టర్లు జితేశ్, ముజమ్మిల్ ఖాన్ పాల్గొన్నారు.

# ఇంటర్ పరీక్షలు ప్రారంభం

- ప్రథమ సంవత్సరం పరీక్షలకు 'బీ' సెట్ ప్రశ్నపత్రం ఎంపిక
- ఉమ్మడి ఖమ్మం జిల్లాలో గంట ముందుగానే కేంద్రాలకు విద్యార్థులు
- 'ఖమ్మం'లో 18,032 మంది, 'భద్రాద్రి'లో 9,446 మంది హాజరు
- తొలి రోజున 'ఖమ్మం'లో 669 మంది, 'భద్రాద్రి'లో 493 గైర్హాజరు
- పరీక్ష కేంద్రాలను సందర్శించిన ఇంటర్మీడియట్ బోర్డు అబ్జర్వర్లు
- నేటి నుంచి ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు పరీక్షలు

ఖమ్మం అర్బన్/ కొత్తగూడెం గణేశ్ టెంపుల్, మార్చి 5:ఉమ్మడి ఖమ్మం జిల్లా వ్యాప్తంగా ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షలు బుధవారం ప్రారంభమయ్యాయి. తెలుగు/ సంస్కృతం సబ్జెక్ట్‌తో ప్రథమ సంవత్సర విద్యార్థులకు పరీక్షలు మొదలయ్యాయి. విద్యార్థులు గంట ముందుగానే పరీక్ష కేంద్రాలకు చేరుకున్నారు. వారు తొలిసారిగా ఇంటర్ పరీక్షలు రాస్తుండడంతో తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు తోడుగా వచ్చారు. విద్యార్థులు పరీక్షలు రాసేంత సేపూ ఆ పరిసరాల్లోనే వేచి ఉన్నారు. ఇంటర్ పరీక్షలు ప్రారంభమైన సందర్భంగా ఆలయాలు సందడిగా కనిపించాయి. విద్యార్థులంతా ఉదయాన్నే ఆయా ఆలయాలకు వెళ్లి దైవదర్శనం చేసుకున్నారు. హాల్‌టికెట్లకు పూజలు చేయించారు. పరీక్షలను మంచిగా రాసేలా దీవించాలని భగవంతుడిని వేడుకున్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలను ముద్దాడుతూ 'ఆల్ ద బెస్ట్' చెబుతున్న దృశ్యాలు కన్పించాయి. పరీక్ష కేంద్రాల వద్ద అధికారులు విద్యార్థులను క్షుణ్ణంగా తనిఖీ చేసిన అనంతరం సెంటర్లోకి అనుమతించారు.



ఖమ్మం నయాబజార్ కాలేజీ వద్ద విద్యార్థులను తనిఖీ చేస్తున్న అధికారులు

### ఖమ్మంలో 669 మంది గైర్హాజరు..

ఖమ్మం జిల్లాలో 72 పరీక్ష కేంద్రాల్లో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్షలు నిర్వహించారు. జిల్లాలో 18,701 మంది విద్యార్థులకు గాను 18,032 మంది హాజరైనట్లు, 669 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు డీఐఈవో కే.రవిబాబు తెలిపారు. జనరల్ విభాగంలో 16,317 మంది విద్యార్థులకుగాను 15,845 మంది హాజరైనట్లు, 472 మంది గైర్హాజరైనట్లు డీఐఈవో వెల్లడించారు. ఒకేషనల్ కోర్సుల్లో 2,384 మంది విద్యార్థులకుగాను 2,187 మంది అభ్యర్థులు హాజరైనట్లు, 197 మంది గైర్హాజరైనట్లు తెలిపారు. పలు పరీక్ష కేంద్రాలను ఫ్లయింగ్ స్క్వాడ్‌లు, డీఈసీ సభ్యులు, హై పవర్ కమిటీ సభ్యులు తనిఖీ చేశారు.





కొత్తగూడెంలోని పరీక్షా కేంద్రాల వద్ద విద్యార్థులు

### 'బీ' సెట్ ప్రశ్నపత్రం ఎంపిక..

బుధవారం ప్రారంభమైన ఇంటర్ ప్రథమ సంవత్సర పరీక్షలకు 'బీ' సెట్ ప్రశ్నపత్రాన్ని అందజేశారు. ఉదయం 8:45 గంటలకు పరీక్ష కేంద్రాల వద్ద ప్రశ్నపత్రం సెట్‌ను ప్రదర్శించారు. డీఈసీ సభ్యులు, ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాల సభ్యులు, సిట్టింగ్ స్క్వాడ్ బృందాలు సభ్యులు మొత్తం 39 కేంద్రాలను తనిఖీ చేశారు. ఇంటర్ బోర్డు అబ్జర్వర్లు సీహెచ్.యాదగిరి, కే.విశ్వేశ్వరరావులు నయాబజార్, ఏఎస్‌ఆర్, ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలల్లోని పరీక్ష కేంద్రాలను పరిశీలించారు.

### నేటి నుంచి ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు..


ఇంటర్ ద్వితీయ సంవత్సర విద్యార్థులకు గురువారం నుంచి పరీక్షలు ప్రారంభం కానున్నాయి. ఖమ్మం జిల్లాలోని 72 కేంద్రాల్లో 18,877 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కానున్నట్లు డీఐఈవో తెలిపారు. www.bietelangana.cgg.gov.in లో హాల్‌టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవచ్చని తెలిపారు.

### 'భద్రాద్రి' 9446 మంది హాజరు..

భద్రాద్రి జిల్లాలోని 36 పరీక్ష కేంద్రాల్లో ఇంటర్ ప్రథమ సంవత్సర పరీక్షలు ప్రారంభమయ్యాయి. జనరల్ విభాగంలో 7,532 మంది విద్యార్థులకు గాను 7,284 మంది విద్యార్థులు హాజరయ్యారు. 248 మంది గైర్హాజరయ్యారు. ఒకేషనల్ విభాగంలో 2,407 మంది విద్యార్థులకు గాను 2,162 మంది హాజరయ్యారు. 245 మంది గైర్హాజరయ్యారు. జనరల్, ఒకేషనల్ విభాగాల్లో కలిపి మొత్తం 9,939 మంది విద్యార్థులకు హాల్‌టికెట్లు జారీ చేయగా తొలిరోజు 9,446 మంది విద్యార్థులు హాజరయ్యారు. 493 మంది గైర్హాజరయ్యారు. ఈ వివరాలను జిల్లా ఇంటర్మీడియట్ అధికారులు వెల్లడించారు. తొలిరోజు పరీక్షా కేంద్రాలను ఎస్పీ రోహిత్‌రాజు తనిఖీ చేశారు.

# నాడు వ్యతిరేకించారు.. నేడు ఫోజులిస్తున్నారు

- కేసీఆర్ కృషి ఫలితమే 'సీతారామ' ప్రాజెక్టు..
- మాజీ మంత్రి, తన్నీరు హరీశ్‌రావు



ఖమ్మం, మార్చి 5: కృష్ణా జలాల్లో తెలంగాణ నీటి హక్కులను కాపాడలేని కాంగ్రెస్ చేతగానితనం ఫలితంగానే సాగర్ ఆయకట్టుకు కరువు వచ్చిందని మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు విమర్శించారు. ఈ మేరకు ఆయన బుధవారం ప్రకటన చేశారు. అందులో ఇలా ఉంది– 'కృష్ణా జలాలను ఆంధ్రాకు అక్కడి పాలకులు తరలించుకుపోతున్న పరిస్థితిలో తెలంగాణ రైతులను ఆదుకునేందుకు ఏకైక మార్గం గోదావరి జలాలను ఒడిసి పట్టి ఎత్తిపోయడమేనని నాటి సీఎం కేసీఆర్ భావించారు. ఇందుకోసమే సీతారామ ఎత్తిపోతల ప్రాజెక్టుకు రూపకల్పన చేశారు. కేంద్రం కొర్రీలను, కాంగ్రెస్ కుట్రలను ఛేదించి దాదాపు 90 శాతం పనులను కేసీఆర్ ప్రభుత్వం పూర్తి చేసింది. ఈ ప్రాజెక్టే వృథా అని నాటి కాంగ్రెస్ నాయకులు అన్నారు. అనుమతులు రాకుండా కోర్టుల్లో కేసులు వేయించారు. కేసీఆర్ పట్టుబట్టి, అన్ని అడ్డంకులను అధిగమించి సీతారామ ప్రాజెక్టును దాదాపుగా పూర్తి చేయించారు. ఇది ఇప్పుడు ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం, సూర్యాపేట, మహబూబాబాద్ జిల్లాల రైతులకు వరంగా మారింది. బీఆర్‌ఎస్ ప్రభుత్వం నిర్మించిన 'సీతారామ' నుంచి గోదావరి జలాలను ఎత్తిపోస్తూ, అక్కడ ఫోటోలకు కాంగ్రెస్ మంత్రులు, నాయకులు ఫోజులు ఇస్తున్నారు. సీతారామా ప్రాజెక్ట్ ద్వారా ఒక్క ఎకరాకు నీళ్లు అందబోవని నాడు ప్రతిపక్షంలో ఉన్న ఇదే కాంగ్రెస్ నాయకులు విమర్శించారు. ఈ రోజు మాత్రం.. అదే ప్రాజెక్ట్ వద్ద ఫొటోలకు ఫోజులు ఇస్తున్నారు. ఓట్లు–సీట్లు–అధికారం శాశ్వతం కాదని, మనం చేసిన అభివృద్ధే చిరస్మరణీయంగా ఉంటుందని నమ్మే నాయకుడు కేసీఆర్. అలా నమ్మి నిర్మించినవే కాళేశ్వరం, సీతారామా ఎత్తిపోతల ప్రాజెక్టులు'.

# అభివృద్ధి పేరిట ఇసుక అక్రమ రవాణా

- అధికార పార్టీ నేతలు జేసీబీలతో తవ్వుకుంటున్నారు
- అడ్డుకోవాల్సిన అధికారులు చోద్యం చూస్తున్నారు
- ఆ ఇసుకను సీజ్ చేయకపోతే ధర్నా చేస్తాం: రేగా



మాజీ ఎమ్మెల్యే రేగా

మణుగూరు టౌన్, మార్చి 5:అభివృద్ధి పనుల పేరిట మణుగూరులోని అధికార పార్టీ నేతలు ఇసుకను అక్రమంగా రవాణా చేసుకుంటున్నారని బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు, పినపాక మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు ఆరోపించారు. మణుగూరులో కాంగ్రెస్ పార్టీ నేతలు ఇసుక అక్రమ రవాణాకు పాల్పడుతన్నారని, అందుకు అధికారులు సహకరిస్తున్నారని ఆరోపిస్తూ మంగళవారం రేగా కాంతారావు సోషల్‌మీడియాలో పోస్టులు పెట్టారు. ఆ అక్రమ ఇసుకను అధికారులు సీజ్ చేయకపోతే బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ధర్నా చేస్తామని స్పష్టం చేశారు. రామానుజవరంలో ఇళ్ల నిర్మాణాల కోసం సాధారణ ప్రజలు తోలుకుంటున్న ఏడు ఇసుక ట్రాక్టర్లను మణుగూరు పోలీసులు పట్టుకొని సీజ్ చేశారని అన్నారు. అయితే, కొందరు కాంగ్రెస్ నేతలు ఏకంగా గోదావరిలో జేసీబీలు పెట్టి 40 మంది వర్కర్లతో 20 ట్రాక్టర్ల ద్వారా రాయగూడెం నుంచి అడ్డగోలుగా ఇసుక రవాణా చేస్తున్నా అధికారులు ఎందుకు స్పందించడంలేదని ప్రశ్నించారు. అధికారుల అండదండలతోనే మణుగూరులో పట్టపగలే ఇసుక అక్రమ రవాణా జరుగుతోందని ఆరోపించారు.

## సాగర్ ఆయకట్టుకు గోదావరి జలాలు..
# కేసీఆర్ కృషి ఫలితమే: సండ్ర



ఖమ్మం, మార్చి 5: సీతారామ ఎత్తిపోతల పథకం ద్వారా సాగునీటిని విడుదల చేయడం సంతోషకరమని సత్తుపల్లి మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య పేర్కొన్నారు. కేసీఆర్ కృషిని ఇన్నాళ్లకు ఈ కాంగ్రెస్ ప్రభుత్వం గుర్తించిందని చురకలంటించారు. ఈ మేరకు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. సీతారామ ప్రాజెక్టు ద్వారా తొలి ఫలితం అందుకుంటున్న వైరా, మధిర, సత్తుపల్లి నియోజకవర్గాల రైతులు అదృష్టవంతులని సండ్ర అన్నారు. నాగార్జున సాగర్ ఆయకట్టుకు గోదావరి నీళ్లను తరలించడం కేసిఆర్ వల్లనే సాధ్యమైందని జిల్లా రైతులందరూ కొనియాడుతున్నారని అన్నారు. సీతారామ ప్రాజెక్టును ప్రతిపాదించింది, నిధులు కేటాయించింది, నిర్మించింది గత కేసీఆర్ పాలనలోనేనని సండ్ర గుర్తుచేశారు. కేసీఆర్ నిర్మించిన సీతారామ ఎత్తిపోతల ప్రాజెక్టును కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పుడు ప్రారంభించిందని అన్నారు. సీతారామ ప్రాజెక్టులో పెండింగ్ పనులను కూడా పూర్తి చేసి ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని అన్ని నియోజకవర్గాలకూ సాగునీరు అందించాలని సండ్ర డిమాండ్ చేశారు. 75 ఏళ్ల స్వాతంత్ర్య భారతంలో ఏ ప్రభుత్వమూ సాధించలేని ఘనతను గత కేసీఆర్ ప్రభుత్వం సాధించిందని గుర్తుచేశారు.

## రూ.100 కోట్లు ఖర్చు.. చుక్క నీరు కరువు

- జాలిముడి ప్రాజెక్టును పరిశీలించిన బీఆర్‌ఎస్ రైతు బృందం



జాలిముడి ప్రాజెక్టును పరిశీలిస్తున్న మాజీ చైర్మన్ లింగాల కమల్‌రాజు

మధిర. మార్చి 5: రూ.100 కోట్ల ఖర్చుతో నిర్మించిన జాలిముడి ప్రాజెక్టు ద్వారా రైతులకు సాగు నీరు చుక్క కూడా అందలేదని జిల్లాపరిషత్ మాజీ చైర్మన్ లింగాల కమల్‌రాజు ఆవేదన వ్యక్తం చేశారు. మధిర మండలంలోని జాలిముడి గ్రామంలోగల జాలిముడి ప్రాజెక్టును బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో రైతు బృందంతో కలిసి కూలిపోయిన లెఫ్ట్ కెనాల్‌ను, తూము షట్టర్‌ను బుధవారం పరిశీలించారు. అక్కడ విలేకరులతో ఆయన మాట్లాడుతూ.. రైతులకు ఏమాత్రం ప్రయోజనం లేని ఈ ప్రాజెక్టును వంద కోట్ల రూపాయలు వెచ్చించి ఎందుకు నిర్మించినట్లని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. జాలిముడి ప్రాజెక్టుకు నాటి ముఖ్యమంత్రి కొణిజేటి రోశయ్య, సిరిపురం వద్ద వర్చువల్ పద్ధతిలో శంకుస్థాపన చేసిన విషయాన్ని గుర్తు చేశారు. ఆనాడు 4700 ఎకరాలకు నీరు అందించేలా కుడి–ఎడమ కాలువలను నిర్మించారని, మధిర–బోనకల్లు మండలాలను సస్యశ్యామలం చేస్తామని చెప్పారని అన్నారు. ఇది ఆచరణలో అమలు కాలేదన్నారు. కొట్టుకుపోయిన కాల్వకు మరమ్మతులు చేపట్టాలని, ప్రాజెక్టు పక్కనే ఉన్న రైతులను కాపాడేందుకు వరద కాలువను ప్రభుత్వం నిర్మించాలని, దీనిపై డిప్యూటీ సీఎం స్పందించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మాజీ ప్రజాప్రతినిధులు, నాయకులు, రైతులు చిత్తారు నాగేశ్వరరావు, బొగ్గుల భాస్కర్ రెడ్డి, అరిక శ్రీనివాసరావు, మరతం నరసింహారావు, కనకపూడి పెద్ద బుచ్చయ్య, చావా వేణు బాబు తదితరులు పాల్గొన్నారు.

# రూ.40 కోట్లు వృథా!

**టీఎస్ ఆయిల్‌ఫెడ్ సంస్థలో రూ.40 కోట్లు వృథా అయ్యాయి. సంస్థ ఉన్నతాధికారుల అనాలోచిత నిర్ణయాల కారణంగా 'పవర్‌ప్లాంట్' నిరుపయోగంగా దర్శనమిస్తున్నది. పవర్‌ప్లాంట్ కోసం వెచ్చించిన నిధులకు వడ్డీ కింద సంస్థపై ఏటా మరో రూ.2.88 కోట్ల భారం అదనంగా పడుతోంది. పవర్‌ప్లాంట్‌లో విద్యుదుత్పత్తి కాకపోవడంతో నెలవారీ విద్యుత్‌బిల్లుల చెల్లింపు భారం సైతం సంస్థకు తప్పడం లేదు. గతంలో దమ్మపేట మండలం అప్పారావుపేట ఫ్యాక్టరీ ప్రాంగణంలో రూ.2.44 కోట్లతో ఏర్పాటు చేసిన వాటర్‌ప్లాంట్ మూతపడటంతో నిధులు దుర్వినియోగమయ్యాయి. ఈ వ్యవహారాన్ని 'నమస్తే తెలంగాణ' దినపత్రిక అప్పట్లో వెలుగులోకి తెచ్చింది. కమీషన్ల కోసం కక్కుర్తిపడి ఉన్నతాధికారులు అడ్డగోలుగా నిధులు ఖర్చు చేయడంతో సంస్థకు నష్టం వాటిల్లుతోందని ఉమ్మడి ఖమ్మంజిల్లా ఆయిల్‌పాం రైతులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఎన్ని సంఘటనలు జరిగినా ఉన్నతాధికారుల తీరు మారడం లేదని అసహనం చెందుతున్నారు. – అశ్వారావుపేట, మార్చి 5**

- ఆయిల్‌ఫెడ్‌లో నిరుపయోగంగా 'పవర్‌ప్లాంట్'
- వడ్డీ కింద సంస్థపై ఏటా మరో రూ.2.88 కోట్ల భారం
- ఫ్యాక్టరీలో నెలవారీ తప్పని విద్యుత్‌బిల్లులు
- కమీషన్ల కోసం ఉన్నతాధికారుల కక్కుర్తి ఫలితం



అశ్వారావుపేట ఫ్యాక్టరీలో నిర్మించిన పవర్‌ప్లాంట్

ఫ్యాక్టరీ నిర్వహణ కోసం సొంతంగా విద్యుదుత్పత్తి సాధన లక్ష్యంగా టీఎస్ ఆయిల్‌ఫెడ్ 2023 జూలైలో సివిల్ వర్క్‌తో కలిపి సుమారు రూ.40 కోట్లతో 2.5 మెగావాట్స్ సామర్థ్యం గల పవర్‌ప్లాంట్‌ను నిర్మించింది. ప్లాంట్‌ను 2024, అక్టోబర్‌లో జిల్లాకు చెందిన ముగ్గురు మంత్రులు ఆర్భాటంగా ప్రారంభించారు. ప్రత్యేకంగా సంస్థ 20మంది సిబ్బందిని కూడా కాంట్రాక్ట్ పద్ధతిన తీసుకుంది. ఇంతవరకు బాగానే ఉంది. కానీ పవర్‌ప్లాంట్ నిర్వహణకు అవసరమైన గెలలు సేకరణ జరగకపోవడంతో ప్లాంట్ నిలిచిపోయింది. ఫలితంగా ప్లాంట్ నిర్మాణానికి వెచ్చించిన రూ.40 కోట్లతోపాటు అందుకు వడ్డీ కింద ఏటా రూ.2.88 కోట్లు, సిబ్బంది వేతనాల కోసం మరో రూ.30 లక్షలు సంస్థపై ఆర్థిక భారం పడుతోంది. అయినా ఉన్నతాధికారులకు చీమ కుట్టినట్లు కూడా లేదు.

### 500 మెట్రిక్ టన్నుల గెలలు అవసరం

పవర్‌ప్లాంట్‌లో విద్యుత్ ఉత్పత్తి జరగాలంటే ప్రతిరోజూ 500 మెట్రిక్ టన్నుల గెలలు క్రసింగ్ చేయాల్సి ఉంటుంది. కానీ ఆ మొత్తంగా గెలల దిగుమతులు అందుకోలేకపోవడంతో ప్లాంట్‌ను అధికారులు తాత్కాలికంగా నిలిపివేశారు. ఫ్యాక్టరీకి వస్తున్న కొద్దోగొప్పో గెలలను రెండు షిఫ్టుల్లో అధికారులు క్రసింగ్ చేస్తున్నారు. కేవలం మే నుంచి అక్టోబర్ వరకు మాత్రమే అధికారుల అంచనా మేరకు గెలల దిగుమతులు ఉంటాయి. అవి కూడా కచ్చితంగా అంచనా వేయలేరు. ఈ లెక్కన ఏడాదిలో 6 నుంచి 7నెలలపాటు పవర్‌ప్లాంట్‌ను నడపటం చాలా కష్టం. మిగతా 5 నెలల కోసం రూ.కోట్లు వెచ్చించాల్సిన అవసరం ఏముందంటూ రైతులను నిలదీస్తున్నారు. కమీషన్ల కోసం తప్ప సంస్థ పురోగతి, రైతు సంక్షేమం అవసరం లేదా..? అంటూ నిలదీస్తున్నారు. ఉన్నతాధికారుల అనాలోచిత నిర్ణయాలతో సంస్థ ఆర్థికంగా నష్టపోతుందని, ఈ నష్టం కాంట్రాక్టర్లు, అధికారుల జేబుల్లోకి వెళ్లిపోతున్నాయని మండిపడుతున్నారు.

### తప్పని విద్యుత్ బిల్లుల భారం

ఆర్భాటంగా ప్రారంభించిన పవర్‌ప్లాంట్ నిలిచిపోవటంతో సంస్థపై విద్యుత్‌బిల్లుల భారం తప్పడం లేదు. 2024 అక్టోబర్‌లో పవర్‌ప్లాంట్ ప్రారంభమైనా ఆ నెల కరెంట్ బిల్లు రూ.15,26,131 చెల్లించాల్సి వచ్చింది. నవంబర్, డిసెంబర్ నెలల్లో మరమ్మతుల నిమిత్తం ఫ్యాక్టరీని తాత్కాలికంగా నిలిపివేసినా కనీస బిల్లు చెల్లించక తప్పలేదు. నవంబర్‌లో రూ.3,90,774, డిసెంబర్‌లో 3,89,931 చొప్పున ఆయిల్‌ఫెడ్ సంస్థ విద్యుత్ భారం భరించింది. అలాగే గత నెల జనవరిలో కేవలం 200 మెట్రిక్ టన్నుల గెలలను క్రషింగ్ చేసి ఏకంగా రూ.7,46,355 విద్యుత్ బిల్లు చెల్లించింది. పవర్ ప్లాంట్ నడవాలంటే 24 గంటలపాటు గెలల క్రసింగ్ జరగాలి. ఎక్కువసార్లు ఆన్, ఆఫ్ చేయడం వల్ల ప్లాంట్ ఎఫిసెన్సీ పడిపోయి మిషన్ దెబ్బతినే అవకాశం ఉంటుంది. గెలల క్రసింగ్ జరిగేటప్పుడు బాయిలర్ స్టార్ట్ చేసి టర్బాయిన్‌కు కనెక్ట్ చేస్తేనే విద్యుదుత్పత్తి అవుతోంది. ఈ ప్రాసెసింగ్ సుమారు 3 గంటలు పడుతోంది. దీనికోసం ప్రతిరోజూ ఫ్యాక్టరీ 500 టన్నుల గెలలను క్రషింగ్ చేయాలి.

### అధికారుల కమీషన్ల కక్కుర్తి..

సంస్థలో కొందరు అధికారుల కమీషన్ల కక్కుర్తి కారణంగా ఆయిల్‌ఫెడ్ సంస్థ నిధులు నిరుపయోగమవుతున్నాయి. ప్రణాళిక లేకుండా నిధులు ఖర్చు చేయడం వల్ల సంస్థకు, రైతులకు ఎటువంటి ప్రయోజనం లేకుండాపోతున్నది. అనేకసార్లు అధికారుల తీరును రైతులు, రైతు సంఘం నేతలు వ్యతిరేకించినా కనీసం మార్పు రావడం లేదు. సంస్థ నష్టపోతున్న నిధులన్ని కాంట్రాక్టర్లు, అవినీతి అధికారుల జేబుల్లోకి వెళ్తున్నాయని రైతుసంఘం నేతలు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

### గెలలు దిగుబడి లేకనే నిలిపివేశాం..



నిర్వహణకు సరిపడా ఆయిల్‌పాం గెలల దిగుబడి లేకనే పవర్‌ప్లాంట్‌ను నిలిపివేశాం. 24 గంటల పాటు ఫ్యాక్టరీని నడిపితేనే పవర్‌ప్లాంట్ పనిచేస్తుంది. ఇందుకోసం ప్రతిరోజూ 500 మెట్రిక్ టన్నుల గెలలు అవసరం ఉంది. ప్లాంట్‌ను ఎక్కువసార్లు ఆన్, ఆఫ్ చేయడం వల్ల మిషన్ ఎఫిసెన్సీ పడిపోయి దెబ్బతినే ప్రమాదం ఉంది. అందుకే ప్లాంట్‌ను వినియోగించడం లేదు. పవర్‌ప్లాంట్ కోసం నియమించిన 20మంది సిబ్బందిని ఫ్యాక్టరీ నిర్వహణలో వినియోగించుకుంటున్నాము. సీజన్‌లో గెలల దిగుబడి ఉంటే పవర్‌ప్లాంట్‌ను వినియోగిస్తాం. విద్యుత్‌బిల్లుల చెల్లింపు తప్పని పరిస్థితి.

**– నాగబాబు, ఫ్యాక్టరీ మేనేజర్, అశ్వారావుపేట**

### అనాలోచిత నిర్ణయాలతో సంస్థకు నష్టం



ఆయిల్‌ఫెడ్ ఉన్నతాధికారుల అనాలోచిత నిర్ణయాలతో సంస్థ ఆర్థికంగా చాలా నష్టపోతోంది. దీనివల్ల రూ.కోట్ల నిధులు నిరుపయోగమవుతున్నాయి. ఈ నిధులన్నీ కాంట్రాక్టర్, అవినీతి అధికారుల జేబుల్లోకి వెళ్తున్నాయి. గెలల సేకరణ లేకున్న రూ.40 కోట్లతో పవర్‌ప్లాంట్ నిర్మించారు. నిర్వహణకు కోసం 20 మంది సిబ్బందిని నియమించారు. కానీ విద్యుదుత్పత్తి చేయకపోగా పెట్టిన పెట్టుబడికి వడ్డీ కింద ఏటా రూ.2.88 కోట్లు చెల్లించి సంస్థ ఆర్థిక పురోగతిని అధికారులు దెబ్బ తీస్తున్నారు.

**– తుంబూరు ఉమామహేశ్వర్‌రెడ్డి, అధ్యక్షుడు, తెలంగాణ ఆయిల్‌ఫెడ్ అశ్వారావుపేట జోన్ ఆయిల్‌పాం గ్రోవర్స్ సొసైటీ, సత్తుపల్లి**




మన రాష్ట్రం మన పత్రిక
నమస్తే తెలంగాణ
నమస్తే తెలంగాణ దినపత్రికలో
చందా కొరకై మరియు పత్రికా పంపిణీలో
ఏమైన సమస్యలు ఉంటే సంప్రదించగలరు
సెల్ : 9182777073
నమస్తే తెలంగాణ దినపత్రికలో అన్ని రకాల
ప్రకటనలు (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు సంప్రదించగలరు
సెల్ : 9182777616